కథానిక

# దివ్య స్మృతులు

"సుబ్బన్న"

సగం విడిచిన మల్లి మొగ్గలాగ ఉంది.

'క్రాఫ్టు' క్లాసులో శ్రద్ధగా కూర్చుని నవ్వారు చేస్తున్నది. శారద ఆ పిల్లకు పెట్టిన పేరు. ఆ ప్రక్కనే చీకిరికళ్ళ దుర్గాంబ రాటం త్రిప్పుతున్నది. ఎడమప్రక్కగా నిలబడి రుమాలులు వేయడానికి వేసిన మడుగు సరిచేస్తున్నారు రామారావుగారు, మిగత పిల్లలు తకిలీలు త్రిప్పుతున్నారు.

లెక్కల క్లాసులోంచి పారిపోయి వచ్చిన సుబ్రమణ్యం వాకిలిదగ్గర నిలబడి ఓరకంటితో శారదను చూస్తున్నాడు. శారద తన పనిలో నిమగ్నమై ఉంది. రాటం త్రిప్పే దుర్గాంబ తలకూడ త్రిప్పుతున్నది. సుబ్రమణ్యాన్ని చూసి పై పళ్ళతో క్రింది పెదవిని నొక్కిపట్టి ముఖం విసురుగా ప్రక్కకు తిప్పింది.

మొండిగాఉన్న చీపురుజడ వికారంగా కదిలింది.

సుబ్రమణ్యం క్లాసులో కెళ్ళాడు. పిల్లలందరికీ ఉత్సాహంగా ఉంది. 'క్రాఫ్టు'టీచరు రామారావుగారు వినయంగానే అడిగారు.

'దేనికొచ్చావయ్యా?'

'చూట్టానికండి' చెబుతూనే చూశావా నా ప్రతాపం అన్నట్టు దుర్గాంబ వంక చూశాడు సుబ్రమణ్యం.

'చూసేదేమిటి? క్లాసుకుపోకుండా?' దురుసుగా అడిగారు.

'ఇది మాత్రం క్లాసు కాదేమండి?' పిల్లలంతా ఘొల్లున నవ్వేశారు. దుర్గాంబమాత్రం చేత్తో నోరు మూసుకుని, కొంగలాగ మెడ ముందుకు చాపి నసిగింది. రామారావుకి ఒళ్ళు మండింది. కాని తనకంటే ఆర్థికంగాను, భౌతికంగాను బలవంతుడైన సుబ్రమణ్యాన్ని ఏం చేస్తాడు! వాడి పేరు చెబితే హెడ్మాస్టరుకే వణుకు. పైగా వాడు కమిటీమెంబరు కొడుకు.

కోటికి పడగెత్తి నాగప్రతిష్ఠ చేసి, సుబ్రమణ్యస్వామికి వెండివాహనం చేయించిన ఫలితంగా కలిగిన ఏకైక సంతానం సుబ్రమణ్యమే!

పట్టుమని పదినిమిషాలైనా వాడే క్లాసులోనూ కూర్చోడు. వరప్రసాది గనుక అభిమానమంటే ఏమిటో వాడికి తెలియదు. పాఠం చదివిన పాపాన ఎన్నడూ పోలేదు. అయితేనేం, ప్రతి క్లాసు ప్యాసవుతూనే ఉన్నాడు. ప్రతి సినిమా చూస్తూనే ఉన్నాడు.

శారదకు దగ్గరగా వెళ్ళి 'ఈ నవ్వారు ఎంత బాగున్నదీ!' అంటూ నవ్వారును పట్టుకొని పరిశీలిస్తున్నాడు. శారద చురుగ్గా చూసి, చెంగున గంతేసి, క్లాసు వదలి వెళ్ళిపోయింది. రామారావుగారి కోపం చరమ సీమ దాటింది ముఖం కందగడ్డలాగ జేవురించింది. నరాలు పైకుబికినై. 'గెట్ అవుట్ ఫూల్' అన్నారు.

సుబ్రమణ్యం చలించలేదు. 'అదేమిటో కాస్త తెలుగులో చెప్పండి' వెటకారంగా అన్నాడు.

'ముందు నీవు బయటికి పో' గదిమాడు.

'దేనికండీ?' మొండికేశాడు.

'ఎందుకొచ్చావిక్కడికి?'

'నవారు చేయడానికి.'

'ఇప్పుడు నీకు లెక్కలు. ఆ క్లాసుకు వెళ్ళు.'

'లెక్కలేమిటండీ నవారు నేర్పమంటే? గాంధీగారేమన్నారు? చేతిపనులు ముందు నేర్చుకోమన్లా?' తర్కంలోకి దిగాడు.

రామారావుగారు గబగబమెట్లెక్కి హెడ్మాస్టరుగారి గది చేరుకొన్నారు.

సుబ్రమణ్యం శారద చేసిన నవారు తెంచబోయినాడు. దుర్గాంబ బ్లేడు ఇచ్చింది. దానితో అంతవరకు ఆ నవారుముక్క తీసుకొని సిగరెట్ల కోసం బజారుకెళ్ళాడు సుబ్రమణ్యం.

* * *

'సుబ్రమణ్యాన్ని డిస్‌మిస్ చేస్తారా? నన్ను మరో వృత్తి చూసుకోమన్నారా?' నిక్కచ్చిగా అడిగేశారు రామారావుగారు.

'నిక్షేపంలాగ చూసుకోవచ్చు. దానికేం!' అన్నారు హెడ్మాస్టరు గారు కళ్ళజోడు తుడుస్తూ.

'అంతేగాని వాడినేమీ చేయరన్నమాట' తేల్చిచెప్పమన్నట్లుగా చూశారు రామారావుగారు. కోపావేశంలో ఏదో అడిగారు గాని, వాడిని హెడ్మాస్టరుగారు ఏమీ చెయ్యలేరని రామారావుగారికి ఇదివరకే తెలుసు.

'వాడేం చేశాడని శిక్షించడం!' మొదటికి వచ్చారు శ్రీవారు.

'ఆడపిల్లలు పనిచేస్తూ ఉండగా క్లాసులోకి వచ్చి అల్లరి చేశాడు.' ఫిర్యాదును తిరిగి ఉపపాదించారు.

'వాడిని క్లాసులోకి ఎందుకు రానిచ్చారో- ముందు దానికి సంజాయిషీ ఇవ్వండి' అంటూ కళ్ళకు జోడు తగిలించారు శ్రీవారు.

అధఃపాతాళానికో- ఇంకా దాని అడుగుకో- వెళ్ళారు రామారావుగారు. కాస్త తెప్పరిల్లి గుటకమింగి 'నేను రానివ్వలేదు. వాడేవచ్చాడు. ఎంతచెప్పినా బయటికి పోలేదు. అందుకనే మీదగ్గరకొచ్చాను.' గబగబా అన్నారు.

'మీక్లాసుకు వాడెందుకొచ్చాడు!' ఏదో అడిగేశారు.

రామారావుగారు చప్పున సమాధానమివ్వలేకపోయినారు. ఎందుకొచ్చాడేమిటి?- క్రాఫ్టు క్లాసు గనుక, వాడు సుబ్రమణ్యం గనుక, పైపెచ్చు ఆడపిల్లలున్నారు గనుక, ఈ విషయాలు మనస్సులో పరిగెడినై కాని వాటిని దిగమింగి 'వాడి స్వభావమే అంత.' అని మాత్రం అన్నారు.

'వాడి స్వభావమేమిటి? అందరి క్లాసులకూ వెళ్ళడేం? మీ మాదిరి ఇంకెవరూ ఫిర్యాదు చెయ్యరేం! నా క్లాసుకు రాడేం!' దబాయించారు హెడ్మాస్టరుగారు గనుక.

వారన్నమాటల్లో చివరిది అక్షరాలా నిజం. సుబ్రమణ్యం హెడ్మాస్టరుగారిక్లాసుకు ఎప్పుడూ వెళ్ళడు. ఆయన క్లాసుకే కాదు వాడు వెళ్ళవలసిన క్లాసుకు దేనికీ వెళ్ళడు. అదే వాడి ప్రత్యేకత.

బరువైన గుండెతో మెల్లిగా మెట్లు దిగారు రామారావుగారు.

ఫిర్యాదు ఫలితంగా రామారావుగారు చేతకానివాడని తేల్చారు హెడ్మాస్టరుగారు.

నెమ్మదిగా క్లాసు చేరుకొనేసరికి సుబ్రమణ్యం చేసిన ఘనకార్యం కంటబడ్డది రామారావుగారికి. నవారు పడుగు పాడైపోయింది. ఎక్కడి కదుళ్ళక్కడ పారేసి పిల్లలంతా పారిపోయినారు. గది గందరగోళంగా ఉంది. రామారావుగారి మెదడులో జెర్రిపోతులు తిరిగినై. నలికలపాములు మెదిలినై, గొంగళీ పురుగులు ప్రాకినై. భరించలేక కళ్ళు మూసుకొన్నారు.

* * *

ట్రెయినింగు క్లాసు పరీక్షాధికారి హాల్లో ఉన్నారు. ఒకమూల కూర్చున్న రామారావుగారు వారినాకర్షించారు. చిరునవ్వుతో అధికారి సమీపించారు. రామారావుగారు నేసిన దుప్పటిని చూశారు. పనితనం పసందుగా ఉన్నది. దానిచుట్టూ అంచున తీర్చిన లతలు స్వాభావికంగాను ఆకర్షణీయంగాను ఉన్నై. 'సెహబాస్' అంటూ అధికారి ముందుకు నడిచారు. ఆయన కూతురు స్వర్ణలత తన పొడుగాటి వ్రేళ్ళతో దుప్పటిని పైకితీసింది. కళ్ళు తళతళ మెరిసినై. హృదయం ఉప్పొంగింది. ఆ బంగారుబొమ్మ ఉత్సాహంతో ఆ దుప్పటిని కప్పుకొన్నది. అంత అందమైన అంచు నేసిన శిల్పికి నమస్కారమన్నది. రామారావుగారు నేసిన పూదీగె స్వర్ణలత మెయి తీగెను పైన వేసుకొన్నది. ఆనందంతో అడుగులు వేసింది స్వర్ణలత. గర్వంతో చూస్తూ నిల్చున్నాడు శిల్పి.

* * *

గాంధీమహాత్ముడు ఆంధ్రలో అడుగు పెట్టాడు. విజయవాడ రైల్వే స్టేషను కిటకిటలాడిపోయింది. ప్లాట్‌ఫారం పొడుగునా జనమే. పోలీసులు సర్దలేకుండా ఉన్నారు. రేకులమీదకు కొంతమంది, ఆగివున్న గూడ్సుబండి గూడు మీదికి మరికొంతమంది ఎక్కి కూర్చున్నారు. రైలుపెట్టెలోనుండి మహాత్ముడు చేతులు బైటకు చాపారు. నగలు, నాణాలు వారి చేతులమీదుగా లోనికి ప్రవహిస్తున్నై. లక్షాధికారులు మహా

తన్మయత్వాన్నిస్తున్నారు. భిక్షాధికారులు ఆ దివ్య పురుషుని సందర్శిస్తున్నారు. కోలాహలం ఎక్కువైంది. జయజయ ధ్వానాలు మిన్నుముట్టినై. అధికారవర్గం తహతహలాడుతున్నది. ఆ మధ్యనే ఐదు లక్షలు సంపాదించిన త్యాగ పురుషుడు మహాత్మునికో రత్నాలహారం అర్పించబోతున్నాడు. పోలీసువారు జాగ్రత్తగానే వున్నారు. ఎండలో హారం ధగధగ మెరిసింది.

అప్పటికి రామారావు చిన్నవాడు. జనాన్ని త్రోసుకొని ఎట్లాగో దగ్గరకు చేరగలిగాడు. అతనికి ముచ్చెమటలు పోసినై. చొక్కా చిరిగిపోయింది. జుట్టు రేగివుంది.

లక్షాధికారి హారమందివ్వబోయే సమయాన.

'ఇదిగో మహాత్మా! తీసుకో!' గాద్గదికంగా అరిచాడు రామారావు. ధర్మదాత చేతిలోని హారమలాగే ఉంది. ఎక్కడ తెగిపోతుందో నని అతని పంచప్రాణాలు దానిచుట్టూ పహరా తిరుగుతూనే ఉన్నై. మహాత్ముడు చేతులు చాపి ఆ అరాకొరి అందించిన మూట నందుకొన్నాడు. నలిగిపోయిన ఖద్దరు చేతిరుమాలు. సంతోషంతో మూటను విప్పాడు. నాలుగు బంతిపూలు కనిపించినై. ఆ రుమాలు చుట్టూ సంస్కృత లిపిలో చేసిన 'రామ' మంత్రం ప్రతిధ్వనించింది. హృదయ తంత్రులు మారుమ్రోగినై. బోసినోరు తెరచి 'ఎవరు?' అన్నారు.

'నేనే, బంతిపూలు తెచ్చా తీసుకో!' అమితోత్సాహంతో ఎగురుతూ అన్నాడు రామారావు.

'ఈ ఖద్దరు నేసిం దెవరు?'

'నేనే, దానిచుట్టూ అంచు కట్టిందీ నేనే! నూలువడికిందీ నేనే!'

ధగధగ మెరిసే మణిహారం అక్కడే ఉంది. తన కివ్వబోయే విలువైన కానుకల మధ్యగుండా చేతులుచాపి ఆ మురికి పిల్లవాడిని పైకి లాక్కున్నాడు మహాత్ముడు. దగ్గరగా తీసుకొని ప్రేమతో తడిసిన ఆ బాలుడి ఫాలాన్ని తుడిచి ముద్దిడుకొన్నాడు ఆ సత్యస్వరూపుడు.

'గాంధీని నేను తాకానోచ్! సుబ్బారావ్ తాతయ్యా నేను తాకాను!' అరుస్తూ రామారావు మహాత్ముని బోడితల నిమిరాడు. ఆనందం పట్టలేక చపచప బాదేస్తున్నాడు. ప్రక్కనున్న వారు వారించారు. ముళ్లకాలు కరిగి కదిలిపోయినై. ధవలక్ష్మి బరువై నిల్చిపోయింది. గంధర్వులు నృత్యం చేశారు. దేవతలు దివ్యరథం పట్టారు. కళాధి దేవత అవలీలగా ఆసనాన్ని అధిరోహించింది. రథం అనంతపథాలలో విహరిస్తున్నది. దివ్యజ్యోతులు ప్రసరించినై. రామారావు విప్పలేక విప్పలేక కనురెప్పలు విప్పాడు.

* * *

తెగిపోయిన సహారు పసుపు గాలికి మెలికలు తిరిగిపోయింది. చెరిగిపోయిన కదుళ్ళ దారం చిక్కు పడిపోయింది. రామారావుగారు పాపారావు కాగితం శ్రీవారి కందించి తేలిగ్గా బయటికి నడిచారు.

* * *

మరునాడు స్కూలంతా గందరగోళంగా ఉంది. పిల్లలంతా గుంపులు గుంపులుగా చెప్పుకొంటున్నారు.

'నాటకాలు వేయించే రామారావుగారు వెళ్లిపోయినారు.'

'చేతిపనులు నేర్పే రామారావుగారు లేరు.'

'చిరిగిపోయిన పుస్తకాలు ఊరికినే బయిండు చేసి ఇచ్చే రామారావుగారు వెళ్లిపోయినారు.'

'ఫోటోలు తీసే రామారావుగారు. బొమ్మలు వేసే రామారావుగారు ఆటలు ఆడించే రామారావుగారు వెళ్ళిపోయినారు' ఒకటే గోల. గుంపు మధ్యనుండి 'ఎందుకని?' ఎవడో ఎలుగెత్తి అరిచాడు అంతే. ఎవడు చూచినా ఎందుకని ప్రశ్నించేవాడే. ఐదు నిమిషాల్లో కారణం అందరికీ తెలిసిపోయింది.

మొదటిగంట మోగింది. విద్యార్థులంతా గుసగుసలాడుతున్నారు. రెండవగంట మ్రోగింది. అంతా చకచక బయటికి నడిచారు.

వాళ్ళకి సుబ్రమణ్యం దారిలోనే దొరికాడు. 'పడబడ పడ' పడిపోయినై దెబ్బలూ గుద్దులూ. స్పృహతప్పి సుబ్రమణ్యం కింద పడ్డాడు.

కమిటీ మెంబరు ప్రళయకాల రుద్రులైనారు. విలయతాండవం చేశారు. ఫోన్ చేసి పోలీసు వారిని రప్పించారు. ఎక్కడి విద్యార్థులక్కడే మాయమై పోయినారు. వచ్చిన పోలీసులు వచ్చిన త్రోవనే పోయినారు.